అత్యధికంగా ఆదివాసీలే..!

- ఇల్లెందు అభ్యర్థుల్లో వారే ఎక్కువ
- 20 మందికి గాను 15మంది..

ఇల్లెందు: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ బరిలో అత్యధికంగా ఆదివాసీలే ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 20 మంది అభ్యర్థులు మిగలగా.. ఇందులో 15 మంది ఆదివాసీలే ఉండడం విశేషం. 1978లో ఇల్లెందు అసెంబ్లీ సీటును ఎస్టీలకు రిజర్వ్ చేశారు. నాటి నుంచి జరిగిన పది ఎన్నికల్లో తొమ్మిది సార్లు ఆదివాసీలు ఇక్కడి విజయం సాధించారు. గత ఎన్నికల్లో బంజారావర్గానికి చెందిన బానోతు హరిప్రియ గెలిచారు. కాగా, 2018లో జరిగిన ఎన్నికల్లో 16 మంది బరిలో నిలువగా తొమ్మిది మంది ఆదివాసీలు, ఏడుగురు మంది బంజారా అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈసారి 20 మందికి గాను 15 మంది ఆదివాసీలు, ఐదుగురు బంజారా ఉన్నారు.

నువ్వా.. నేనా అన్నట్లు పోటీ..

గడిచిన ఎన్నికల్లో ఆనాటి సిట్టింగ్ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ అభ్యర్థి కోరం కనకయ్యపై కాంగ్రెస్ అభ్యర్థి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఈసారి వీరిద్దరు బరిలో ఉన్నా పార్టీలు మాత్రం మారాయి. కనకయ్య కాంగ్రెస్ నుంచి, హరిప్రియ నుంచి బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగగా... పోటీ నువ్వా, నేనా అన్నట్లు సాగుతోంది. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు వెయ్యి లోపు ఓట్లు మాత్రమే సాధించగా, ఒక్కరిద్దరికి 1,500 లోపు ఓట్లు వచ్చాయి. అప్పటి ప్రధాన ప్రత్యర్థులే మళ్లీ ఈసారి పోటీలో ఉండడంతో సమరం హోరాహోరీగా సాగుతోంది. దీంతో ఎవరికి వారు తమదైన శైలిలో ఓటు బ్యాంకును కాపాడునేందుకు ప్రయత్నిస్తూనే ప్రత్యర్థుల బలహీనతలపై దృష్టి సారించారు. ఈ తరుణంలో స్వతంత్రులు ఎవరి ఓటు బ్యాంకు గండి కొడతారు, విజయం ఎవరిని వరిస్తుందో అన్న అంశంపై నియోజకవర్గంలో చర్చగా మారింది.


ఇల్లెందు పట్టణ వ్యూ

ఆదివాసీ అభ్యర్థులు..

ఇల్లెందు స్థానం నుంచి పోటీ పడుతున్న ఆదివాసీల్లో ప్రధాన పార్టీలకు సంబంధించి కోరం కనకయ్య(కాంగ్రెస్) ఉన్నారు. ఇక దుగ్గి కృష్ణ (సీపీఎం), కోడి నాగరాజు (గోండ్వానా దండకారణ్య పార్టీ), జార భిక్షం (ఆబాద్ పార్టీ), రమణాల లక్ష్మయ్య (బహుజన ముక్తి పార్టీ), వాసం రామకృష్ణ (భారత చైతన్య యువజన పార్టీ), చీమల వెంకటేశ్వర్లు (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్)తో పాటు స్వతంత్రులుగా గుమ్మడి అనురాధ, ఆరెం విజయ చందర్, మోకాళ్ల కృష్ణ, ముక్తి రాజు, మూతి ముత్తమ్మ, మెస్సు ఉషారాణి, పోలెబోయిన రవి పోటీ పడుతున్నారు.

బంజారాలు...

ఈ దఫా బరిలో బంజారా సామాజికవర్గం నుంచి ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు. వీరిలో బానోతు హరిప్రియ (బీఆర్ఎస్), బాదావత్ ప్రతాప్ (బీఎస్పీ), డి.రవీంద్ర నాయక్ (బీజేపీ) సహా లకావత్ ప్రసాద్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), గుగులోతు భద్రు (ఇండిపెండెంట్), గుగులోతు సాయి కుమార్(ఇండిపెండెంట్) ఉన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం: వనమా

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి పనులే మళ్లీ నన్ను గెలిపిస్తాయని, కేసీఆర్ పాలనలో రాష్ట్రం నేడు సుభిక్షంగా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని విద్యానగర్, రాంనగర్, బాబూ క్యాంప్, ఎస్‌కే నగర్, రామాంజనేయ కాలనీ ప్రాంతాల్లో పార్టీశ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట వనమా వెంకటేశ్వరరావు విద్యానగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రోడ్డు షో నిర్వహించగా భారీ ఎత్తున ప్రజల హాజరై ఆయనకు బ్రహ్మరథం పట్టారు. వనమా మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా కృషి చేశానని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ప్రతీ పేదవాడికి అందుతున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటున్నారని తెలిపారు. దళితులు, బీసీలు, ముస్లిం మైనార్టీల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం ఎకరానికి రూ.10 వేలు అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా భావిస్తూ వెళ్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రతీ కార్యకర్త తిప్పికొట్టాలన్నారు. నవంబర్ 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మానవతారాయ్, ఎడవల్లి కృష్ణ, కంచర్ల చంద్రశేఖరరావు, జేవీఎస్ చౌదరి, బాదావత్ శాంతి, కూసన వీరభద్రం, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..

నవభారత్: బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్, 36 మంది వార్డు కౌన్సిలర్లు బండి నరసింహా ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు వనమా కార్యక్రమం నిర్వహించారు.


చుంచుపల్లి: విద్యానగర్ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా


నవభారత్: ప్రచారంలో పాల్గొన్న కాపు సీతాలక్ష్మి

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

పాల్వంచ: తెలంగాణ సార్వత్రిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టార్ చిల్డ్రన్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జి.భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే సంవత్సరంలో టెన్త్, ఇంటర్ పూర్తి చేయొచ్చని, గృహిణులు, చదువు మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9866806532 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులను ఓట్లు అడగొద్దు..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వని వారికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సౌకర్యాల అమలు విషయంలో మూడోసారి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలు ఈ కార్మికుల సమస్యల పరిష్కార విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకపోతే వీరికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. సింగరేణి పలు విభాగాల్లో ఎన్నికల సందర్భంగా సంఘం వైఖరిని కార్మికవర్గానికి వివరించేందుకు 12 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ వర్కర్లు ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకుంటున్నారని, ఆ తరువాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఓట్లు అడిగే నాయకులు కార్మికుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.

మాది సంక్షేమం.. వారిది సంక్షోభం: ఎమ్మెల్యే హరిప్రియ




కామేపల్లి : ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ, ఇల్లెందు: ప్రచారం చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, నాయకులు

కామేపల్లి: సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ పాలన కొనసాగుతుండగా.. ప్రతిపక్షాలు సంక్షోభం సృష్టించేందుకు కుట్ర పన్నారని ఇల్లెందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియనాయక్ విమర్శించారు. కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తనను మరోమారు కోరారు. కేసీఆర్ ఆశీస్సులు, ప్రజలు బలంతో ఇంకోసారి విజయం సాధిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా తిష్ట వేసి ఉన్న సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. కరోనా కష్ట కాలంలో ముఖం చాటేసిన నాయకులు ఇప్పుడు ఓట్ల కోసం గ్రామాల బాట పట్టారని విమర్శించారు. గ్లోబల్ ప్రచారం చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని హరిప్రియ కోరారు. అనంతరం జాస్తిపల్లిలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు హరిప్రియ సమక్షాన బీఆర్ఎస్‌లో చేరగా, పింజర మడుగులో లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, ఎంపీపీ బానోత్ సునీతతో పాటు గుగులోత్ సునీత, మల్లెంపాటి నర్సింహారావు, గుగులోత్ దేవి, అచ్చమ్మ, కేశోత్ భాస్కర్‌నాయక్, నూతలపాటి మధు, గుజ్జర్లపూడి సతీష్, సత్యం, శెట్టి శ్రీనివాసరావు, సంతోషరావు, పుచ్చకాయల బాబు, గుగులోత్ సుందర్, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, వడియాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యం..

ఇల్లెందు/ఇల్లెందు రూరల్/బయ్యారం: పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్‌తో కలిసి ఆయన ఇల్లెందులోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్లు కటకం పద్మావతి, వాంకుడోతు తారతోపాటు యాకూబ్, అజయ్, సాతెల్లగిరి తదితరులు ఉన్నారు. అలాగే, మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమ ఆధ్వర్యాన 8వ వార్డులో హరిప్రియను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, మళ్లీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుకతోపాటు దాస్యం ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో కూడా హరిప్రియను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయండి

జూలూరుపాడు: జూలూరుపాడు పత్తి సబ్ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పత్తి సబ్ మార్కెట్ యార్డును ప్రజాపంథా నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, హమాలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ.. జూలూరుపాడు సబ్ మార్కెట్‌ను ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి విడగొట్టి శాశ్వత మార్కెట్‌గా ప్రకటించాలన్నారు. స్థానిక మార్కెట్ యార్డు రెండో గుంటూరు మార్కెట్‌గా పిలువబడుతుందన్నారు. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి అనుసంధానంగా ఉండటంతో కనీస సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. సబ్ మార్కెట్‌కు సెస్ రూపంలో రూ.కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ షెడ్లు, విశ్రాంతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు, హమాలీలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. వైరా ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్నవారు జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.గోపాల్‌రావు, బానోత్ ధర్మా, లింగాల వీరభద్రం, హమాలీలు పప్పుల జాను, పోతురాజు బోడయ్య, ఇల్లంగి సుందరరావు, గత్తం భాస్కర్‌రావు, ఇసాక్, మందా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూజారులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది


జగదాంబ దేవి ఆలయంలో పూజలో పాల్గొన్న రాములు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్రంలో పూజారులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని జగదాంబ మేడారం భద్రాకాళి పూజారుల సంఘం జాతీయ అధ్యక్షుడు టి.రాములు అన్నారు. శనివారం స్థానిక జగదాంబ దేవి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ఆలయాల్లో దూప, దీప, నైవేద్యం చేసే పూజారులకు కనీస వేతనం అందడం లేదన్నారు. అంతేగాక పూజారులకు ఏ పథకం ప్రవేశపెట్ట లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వేల్పుల ప్రసాద్, జి.కిశోర్, శంకర్ సాధు, దేశ్యా, సురేశ్ స్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

పాల్వంచ: జయశాలి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆల్ ఇండియా టూ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం పట్టణంలోని సీతారాంపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయశాలి కౌన్సిల్ వ్యవస్థాపకుడు పీడీ సుందర్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు బేతం రవి చేతుల మీదుగా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దీనులను, ఆపదలో ఉన్న వారిని, ఆకలితో ఉన్న వారిని ఆదుకోవాలని యేసుక్రీస్తు తన బోధనల్లో తెలిపారని, వాటిని పాటించాలన్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, దేవరాజ్, నగేశ్, సునీత, జయరాణి, అరుణ, రోజా, కృష్ణవేణి, ప్రణేశ్, అభిషేక్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ ఎన్నికల ప్రచారం..

టేకులపల్లి: కాన్షీరామ్, మాయావతిల ఆశయాలకు అనుగుణంగా, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపన కోసం, ఇల్లెందు ఏజెన్సీలో సకల జనులకు సేవలు చేసేందుకు నెలకు రూ.2 లక్షల జీతం వస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి వచ్చానని, ఏనుగు గుర్తుపై ఓటు వేసి ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని ఇల్లెందు బీఎస్పీ అభ్యర్థి బాదావత్ ప్రతాప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భారీగా ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తరాలు మారినా, ఏళ్లు గడుస్తున్నా బహుజనులకు రాజ్యాధికారం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. తచ్చోడి సత్యనారాయణ, అజ్మీర వెంకన్న, రాయల శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి.. సేవ చేస్తా..

కొత్తగూడెంరూరల్: ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే..సేవకుడిగా పని చేస్తానని కొత్తగూడెం నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. రేగళ్ల, మైలారం, గట్టుమల్ల, బంగారుచెలక తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. అధికార పార్టీ అరాచకాలకు వ్యతిరేకంగా తాము పోరాటం చేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో పార్టీ టికెట్ వస్తే తప్ప పోటీ చేయమని కొందరు, చివరి నిమిషంలో నామినేషన్ వేసి మరికొందరు ఓట్లు అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇలాంటి వారు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. 30న జరగనున్న ఎన్నికలలో అందరికీ అందుబాటులో ఉండే తనను గెలిపించాలన్నారు. వీరూ నాయక్, శంకర్, వినయ్, సోను, శివ పాల్గొన్నారు.

జలగంకు పలువురి మద్దతు..

సుజాతనగర్: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావుకు మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. జలగం వెంకట్రావు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం సుజాతనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చింతలపూడి జగన్, ఉబ్బనపల్లి మణికంఠ, గూని వీరభద్రరావు, కేశవరావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఇల్లందు నియోజకవర్గంలో వివిధ బూర్జువా పార్టీలు ప్రజలను మాయమాటలతో మోసం చేస్తూ అధికారంలోకి రావాలని ప్రయత్నాలు చేస్తున్నాయని అలాంటి పార్టీలను తిరస్కరించి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ అభ్యర్థి మోకాళ్ల కృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇల్లందు నియోజకవర్గ కోకన్వీనర్ జే సీతారామయ్య, స్టీరింగ్ కమిటీ సభ్యులు డి ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బద్దుతండా, నంద్యాతండా గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కల్తీ వెంకటేశ్వర్లు, భూక్యా హర్ష్య, భూక్యా కీర్యా, నర్సింగు, ఈర్యా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: న్యూడెమొక్రసీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన మోకాళ్ల కృష్ణను గెలిపించాలని ఆపార్టీ నాయకులు శనివారం మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం చేశారు. కుండ గుర్తును ఓటర్లకు పరిచయం చేస్తూ వాల్‌పోస్టర్లను గ్రామాలలో ప్రదర్శించారు. నాయకులు మాట్లాడుతూ.. పీడిత ప్రజల కోసం సుదీర్ఘకాలంగా ఉద్యమించిన న్యూడెమొక్రసీని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో నరాటి వెంకటేశ్వర్లు, యదళ్లపల్లి సత్యం, మోకాళ్ల రమేష్, గౌని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


టేకులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

టేకులపల్లి: వానాకాలం 2023–24 సంవత్సరానికి గాను టేకులపల్లి మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బేతంపూడి సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ పాన్నోజు ప్రేమాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టేకులపల్లి, బొమ్మనపల్లి, సంపత్‌నగర్, బోడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సాధారణ గ్రేడ్ రూ.2183, ఏ గ్రేడ్ రూ.2203 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

బీజేపీకి లక్ష్మణ్ అగర్వాల్ రాజీనామా

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్ పదవులతో పాటు పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నానని ఇటీవల బీజేపీలో చోటుచేసుకుంటున్న పరిణామాల కారణంగా పార్టీకీ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఆయన పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

ఎల్ఐసీ ఈడీసీపై అవగాహన


మాట్లాడుతున్న దాసన్

సింగరేణి(కొత్తగూడెం): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సౌత్ సెంట్రల్ జోన్ (హైదరాబాద్) రీజియన్ మేనేజర్ దీపాశివ దాసన్ ఈడీసీపీఎస్ పెన్షన్‌పై జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ పా) కట్టా బసవయ్య ఆధ్వర్యంలో ఆయన చాంబర్‌లో ఉద్యోగులకు, అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. ఎల్ఐసీ రీజియన్ మేనేజర్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ ప్రవేశపెట్టనున్న ఈ పెన్షన్ గ్రూప్ స్కీమ్ ద్వారా కార్మికులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ విరమణ చేయబోయే అధికారులు ఎల్ఐసీ యాన్యుటీ పథకాన్ని ఒక సంవత్సరం ముందు నుంచి తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీఎం హెచ్ఆర్‌డీ బీహెచ్ వెంకటేశ్వరరావు, జీఎం సోలార్ జానకిరామ్, ఎల్ఐసీ అధికారులు ఎస్.జకీర్, రామకృష్ణ, ఏజీఎం పర్సనల్ కోడూరి శ్రీనివాస్‌రావు, డీజీఎం అజయ్‌కుమార్, సీపీపీఎస్ మూర్తి, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, సీనియర్ పీఓ హైమావతి, జేపీఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా 'సింగరేణి'

- అర్ధరాత్రి చిందులు వేస్తున్న అల్లరిమూకలు
- పట్టించుకోని సంక్షేమాధికారులు
- కూల్చివేయాలంటున్న స్థానికులు


క్వార్టర్‌లో తాగి పడేసిన మద్యం సీసాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో కార్మికులు నివాసముండే క్వార్టర్లను నూతన క్వార్టర్ల నిర్మాణంతో కూలుస్తున్నారు. మరోవైపు ఖాళీగా ఉన్న క్వార్టర్లలో ఆకతాయిలు అల్లర్లకు పాల్పడుతున్నారన్న కార్పొరేట్ వెల్ఫేర్ విభాగం అధికారులు పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇదంతా ఏదో మారుమూల ఏరియాలో కాదు.... కార్పొరేట్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న తంతు. కార్పొరేట్ ఏరియాలో బర్మా క్యాంపులోని పోచమ్మ తల్లి దేవాలయం సమీపంలోని డీపీ 233, 234 గతంలో కార్మికులు ఉండేవారు. వారు ఇటీవల కాలంలో వారు రిటైర్ కావటంతో ఆ క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఆ పరిసర ప్రాంత వాతావరణం చూసిన కార్మికులు ఎవరూ ఈ క్వార్టర్లను తీసుకోవటానికి ముందుకు రావటం లేదు. నిత్యం సందడిగా ఈ ఉండే ఈ కాలనీలో కార్మికులు పదవీ విరమణ పొందిన తరువాత ఆ క్వార్టర్లలో ఎవరూ ఉండక పోవటంతో ఆ ప్రాంతమంతా అంధకారంలా మారింది. ఈ నేపథ్యంలో ఖాళీ క్వార్టర్లలో ఆకతాయిలు రాత్రి వేళ నానా హంగామా చేస్తున్నారని, చిందులు వేసి రభస చేస్తున్నారని, రాత్రి సమయంలో మహిళలు అటు వైపుగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ క్వార్టర్లను ఎవరికైనా ఎలాట్‌మెంట్ చేయండి.. లేదా కూల్చివేయండని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ రాజ్యం వస్తేనే అభివృద్ధి: కాంగ్రెస్ అభ్యర్థి కోరం


ఇల్లెందు: కాంగ్రెస్‌లో చేరిన వారితో కోరం కనకయ్య, నాయకులు


గార్ల: ప్రచారంలో భాగంగా టీ కాస్తున్న కనకయ్య

ఇల్లెందు: దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ ఆధ్వర్యాన ఇందిరమ్మ రాజ్యం ఏర్పడితేనే తెలంగాణ అన్నివిధాలుగా అభివృద్ధి సాధిస్తుందని జెడ్పీ చైర్మన్, ఇల్లెందు కాంగ్రెస్ ఇల్లెందు అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. తాము అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు జరగవని, బంధుప్రీతి ఉండదని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు యదళ్లపల్లి అనసూర్య, రమేష్ చంద్రగుప్తతో కలిసి కనకయ్య శనివారం ఇల్లెందులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏ వర్గాన్ని కూడా సంతృప్తి కలిగించని ప్రస్తుత పాలకులను సాగనంపే సమయం ఆసన్నమైందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని తెలిపారు. నాయకులు ఎస్.కే.జానీ, డానియేల్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, పెద్దినేని హరినాథ్‌బాబు, కౌన్సిలర్ వారా రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, పలు వార్డుల్లో కాంగ్రెస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, స్వరూప బేబీ తదితరులు ప్రచారం చేశారు.

టేకులపల్లి, గార్ల మండలాల్లో..

టేకులపల్లి/గార్ల/బయ్యారం: ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య టేకులపల్లి, గార్ల మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసిన ఆయన ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనకబాటుకు గురైందని, తాము అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎంపీటీసీ ఊకె రామకృష్ణ ఆధ్వర్యాన పలువురు కోరం సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు బానోత్ సుజాత, భూక్యా దేవా, ఉండేటి ప్రసాద్, మాడే మధు, పూనెం ఉమ, సురేందర్, బోడా నిరోషా, అజ్మీరా బుజ్జి, ఎదళ్లపల్లి బాబ తదితరులు పాల్గొన్నారు. ఇక గార్ల మండల కేంద్రంలో ప్రచారం చేసిన కనకయ్య... నెహ్రూసెంటర్‌లో హోటల్‌లో టీ కాచి ప్రజలను ఓటు అభ్యర్థించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..

ఇల్లెందురూరల్/బయ్యారం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ కుటుంబానికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇల్లెందు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, సర్పంచ్‌లు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అందరికీ అందాయని గుర్తు చేశారు. మరోమారు తమ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు కిన్నెర నర్సయ్య, తాటి రాంబాబు, మండల రాము, పూనెం సురేందర్, మోకాళ్ళ వెంకటమ్మ, కల్తి పద్మ, పాయం కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇక బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో కనకయ్యను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు.